క్లుప్తంగా

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో ప్రజాప్రతినిధులు, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యేగా మూడో సారి గెలుపొందిన మహిపాల్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖాజీపల్లి, మాదారం గ్రామాల సర్పంచ్‌లు చిట్ల సత్యనారాయణ, సురేందర్‌గౌడ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

ధాన్యం తరలింపు



ధాన్యం కేంద్రం వద్ద వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, సిబ్బంది

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యంను తరలించేందుకు అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులకు ఇబ్బందులు లేకుండా మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధాన్యం తడవకుండా ఉండేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సాధ్యమైనంతవరకు కల్లాల్లో ఉన్న ధాన్యంను తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శ్రీనివాస్ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. సంగారెడ్డిలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి శిక్షణా సంస్థలో మగ్గం వర్క్‌లో శిక్షణ పొందుతున్న మహిళతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టాలు, అనంతరం న్యాయ వ్యవస్థలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ సంస్థ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్, శిక్షకులు ఫరీదా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

హత్నూర (సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ గ్రామ సమీపంలో సంగారెడ్డి దౌల్తాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి దౌల్తాబాద్ ప్రధాన రహదారిపై సుమారు 42ఏళ్ల వయసు ఉన్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతదేహాన్ని గుర్తించినట్లయితే 8712656752 నెంబర్‌కు తెలియజేయాలని ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు) ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెల్లాపూర్‌కు చెందిన గౌస్‌పాషా ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన గౌస్‌పాషా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

రేవంత్‌రెడ్డికి అభినందనలు

చేర్యాల(సిద్దిపేట): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మంగళవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఓడినా ప్రజలకు సేవలందిస్తా

- స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపుతాం
- నియోజకవర్గ చీఫ్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

జహీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా ప్రజల్లోనే ఉంటూ సేవలందిస్తానని నియోజకవర్గ చీఫ్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడినంత మాత్రాన ఇంట్లో కూర్చోబోనని, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమేనన్నారు. రానున్న స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ సత్తా చూపుతామన్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. జహీరాబాద్‌లో బీఆర్‌ఎస్‌ది నైతిక విజయం కాదని, ప్రలోభాలకు గురిచేసి ఓట్లు దండుకున్నారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలువకపోయినా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో ఆశించిన మేరకు అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఎన్నికల్లో తనకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఓట్లు వేసి మద్దతు ఇచ్చారని, తనపై చూపిన ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం చంద్రశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి సముచితస్థానం కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి, నాయకులు హన్మంత్‌రావు పాటిల్, ఎంజి రాములు, కండెం నర్సింహులు, నర్సింహారెడ్డి, స్వామిదాస్, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, షౌకత్‌అలీ, ఖాజామియా, అర్షద్, జమీల్, నవీన్‌కుమార్, షంషీర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని సన్మానించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



సునీతాలక్ష్మారెడ్డిని సన్మానించిన జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, నాయకులు

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సునీతాలక్ష్మారెడ్డిని హత్నూర మండలానికి చెందిన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హత్నూర సర్పంచ్ వీరస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, మాజీ జెడ్పీటీసీ ఆశయ్య, వార్డుసభ్యులు ఆసిఫ్, ఖదీర్, నర్సింహులు, నాయకులు లింగారెడ్డి, యాదయ్య, మము, రాములు, రవి, మానేయ్య, యాదగిరి, సురేష్, ధనుంజయ పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు దుర్గేశ్వర్‌రెడ్డి సునీతాలక్ష్మారెడ్డిని సన్మానించారు. వడ్డేపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ గోవర్ధన్‌రావు ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ సురేష్‌గౌడ్, వార్డు సభ్యులు తరలివెళ్లి సునీతాలక్ష్మారెడ్డిని ఘనంగా సన్మానించారు.

సునీతాలక్ష్మారెడ్డిని కలిసిన నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): నర్సాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సునీతాలక్ష్మారెడ్డిని జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గాండ్ల శ్రీనివాస్, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించారు.

సమన్వయంతోనే సమస్యలకు పరిష్కారం

- అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్

రాయికోడ్(అందోల్): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్ అన్నారు. ఎంపీపీ మమత అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సమష్టిగా విధులు నిర్వహిస్తూ మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. గతంలో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన బిల్లులు, మొక్కల పెంపకానికి సంబంధించిన బిల్లులు త్వరగా అందేవిధంగా చూడాలని సర్పంచ్‌లు హన్మంతు, సంతోష్‌పాటిల్, ఏఈ తాహ, ఏపీఓ రమేష్‌ను కోరారు. పంట పొలాల వద్ద విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, మండలంలోని జహీరాబాద్ నుంచి మామిడిపల్లికి, రాయికోడ్ నుంచి సంగారెడ్డికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సభ్యులు కోరారు. దీంతో స్పందించిన సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశం, డీటీ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు హర్షవర్ధన్‌రెడ్డి, కల్పన, శశికుమార్, నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, కీర్తి, యాదయ్య, రాంకిషన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మొగులప్ప, పండరి, లక్ష్మి, అబేద్‌మియా, ప్రవీణ్‌కుమార్, మైపాల్‌రెడ్డి, నాగార్జున, సలీమ్ పాల్గొన్నారు.

ఘనంగా దామోదర జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న అలుగోల్ శ్రీనివాస్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అందోల్ ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహా, ఆయన కుమార్తె త్రిష జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అలుగోల్ శ్రీనివాస్ దామోదరను కలిసి జన్మదిన శుభాకాంక్ష లు తెలిపారు. ప్రజాజీవితంలో కొనసాగుతూ మరి న్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.

గ్యారంటీ హామీలను అమలు చేస్తాం

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహా అన్నారు. మండల పరిధిలోని సంగుపేటలో స్థానిక ఫంక్షన్‌హాలులో దామోదర జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, రంగ సురేష్, చిట్టిబాబు, రేఖ, శంకర్, నాగరాజు, చందర్, దుర్గేష్, హరికృష్ణగౌడ్, పీసీసీ మెంబర్ కిషన్, పీసీసీ మాజీ అధికార ప్రతినిధి ఇందిరాశోభన్, వట్‌పల్లి, రేగోడ్ జెడ్పీటీసీలు పత్రి అపర్ణ, యాదగిరి, మాజీ జెడ్పిటీసీలు రాజేందర్‌పాటిల్, జానయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని అశోక్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పుష్పనగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యత లోపం లేకుండా రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మిర్జాపూర్(బి)లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): పల్లెప్రకృతి వనాలతో పాటు ఇతర ప్రాంతాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని జహీరాబాద్ డీఎల్‌పీఓ రాఘవా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని మిర్జాపూర్(బి), ఖలీల్‌పూర్ గ్రామాల్లో ఎంపీడీఓ వెంకట్‌రెడ్డితో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా డంప్ యార్డులు, పల్లెప్రకృతి వనాలు, పారుశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు.

పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ జిల్లా నాయకుడు బీరప్ప తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ మంగళవారం బీరప్పను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు చందు, సంతోష్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడి రాజీనామా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపెల్లి గ్రామానికి చెందిన చెలుకల కొండల్‌రెడ్డి బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్ష పదవి, రైతుబంధు గ్రామ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు. పార్టీలో సరైన గుర్తింపులేక పోవడంతో రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

ప్రొఫెసర్ మోతహర్ రెజాకు యూకే ఆహ్వానం



పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ మోతహర్ రెజాను యునైటెడ్ కింగ్డమ్ (బ్రిటన్)లోని డూండీ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆహ్వానించింది. యూనివర్సిటీ ఆఫ్ డూండీలోని ఎన్విరాన్‌మెంటల్ ఫ్యూయిడ్ మెకానిక్స్ లెక్చరర్ డాక్టర్ అనిర్బన్ గుహ 'స్లిప్ వాల్ ఎఫెక్ట్స్ ఆన్ మైక్రోచానెల్ ఫ్లూయిడ్ స్టెబిలిటీ అండ్ బయోమెడికల్ డివైస్ట్ అప్లికేషన్' అంశంపై పరిశోధన చేపట్టేందుకు డాక్టర్ రెజాను ఆహ్వానించారు. ప్రొఫెసర్ రెజా పర్యటనకు భారత ప్రభుత్వ సంస్థ సెర్బ్‌లోని గణిత పరిశోధన ప్రభావం కేంద్రీకృత మద్దతు (మాట్రిక్స్) ద్వారా ఆర్థిక సౌజన్యాన్ని అందిస్తోంది. డాక్టర్ రెజాకు దక్కిన గౌరవం పట్ల గీతం ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద, గీతం అదనపు ప్రొఫెసర్ డీఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి నగేశ, సైన్స్ డీన్ ప్రొఫెసర్ కొల్లూరు శ్రీకృష్ణ, మేనేజ్మెంట్ డీన్–పరిశోధన డైరెక్టర్ డాక్టర్ రాజా, వివిధ విభాగాల అధిపతులు, సహోధ్యాపకులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

జహీరాబాద్: ఎమ్మెల్యే మాణిక్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సర్పంచ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు బండి మోహన్, దళిత నేతలు, పార్టీ నాయకులతో కలిసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మాణిక్‌రావుపై చిరాగ్‌పల్లి సర్పంచ్ దూషిస్తూ సభలో మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు, నాయకులు నారాయణ, మచ్చేందర్, శివప్ప, రాజు, బాబు, లక్ష్మీకాంత్, హీరూరాథోడ్, మొహియొద్దీన్, రవి, గణేష్, చంద్రయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుడి ఊరేగింపు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో కార్తీకమాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం రాత్రి స్వామివారిని నందీశ్వర వాహనంపై ఊరేగించారు. దేవాలయ ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని వనంపల్లి గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్పమాల ధారుడు అంజయ్యగౌడ్, అనంతరాంగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

సంగారెడ్డి పట్టణంలో..

సంగారెడ్డి: పట్టణంలోని నక్క నాగరాజ్ నివాసంలో అయ్యప్పస్వాముల మహా పడిపూజను ప్రకాష్ గురుస్వామి, ఆప్టికల్ శ్రీశైలంస్వామి ఆధ్వర్యంలో 18 మెట్లతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు సత్యం, సంతోష్, సతీష్, అప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

నియోజకవర్గం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించిన అనంతరం మొదటిసారి ఆయన కోహీర్‌లోని ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోల్పోయినందుకు నాయకులు, కార్యకర్తలు నిరాశకు గురికావొద్దన్నారు. నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయబోనని తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ ఐడీసీ చైర్మన్ తన్వీర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, ఎన్నికల కోఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి, సర్పంచులు రాజశేఖర్, కిష్టప్ప, నర్సింహులు, సంగారెడ్డి, రమేష్, నర్సయ్య, ఎంపీటీసీ బక్కారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శుభాష్‌రెడ్డి, ఉమర్, రాజుస్వామి, కలీం, వహీద్, భూమయ్య, ఇఫ్తెకార్, అనంద్, సంపత్‌కుమార్, సందీప్‌కుమార్, అన్వర్‌జావెద్, బాబు, తుక్కప్ప, నాగరాజు, ఖదీర్, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా

జహీరాబాద్: ఎన్నికల్లో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి తన విజయంలో కీలక పాత్ర వహించారన్నారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఐడీసీ చైర్మన్ తన్వీర్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, నాయకులు సుభాష్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, యాకూబ్, మోహన్‌రెడ్డి, బండిమోహన్, జహంగీర్, అబ్దుల్లా, మోతిరాం, యూనూస్, బాబీ పాల్గొన్నారు.

రంజోల్‌లో దారుణ హత్య



హత్యకు గురైన ఝర్నప్ప

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలో ఎరకలి ఝర్నప్ప(38) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. మంగళవారం రాత్రి గ్రామ శివారులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మరణించినట్లు తెలిపారు. ఝర్నప్ప కళాశాలలో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పాత కక్షలతోనే హత్య జరిగి ఉండవచ్చని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఖేడ్‌లో మోస్తరు వర్షం

నారాయణఖేడ్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఖేడ్‌లో మంగళవారం కొద్దిపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండడానికి తోడు చల్లటి గాలులు వీచాయి. మధ్యాహ్నం సమయంలో కొద్దిపాటిగా చిరుజల్లులు కురియడంతో నారాయణఖేడ్‌లో జరిగే వారాంతపు సంతలో వ్యాపారులు, కొనుగోలుదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. చల్లటి గాలులతో చిరుజల్లులు కురియడంతో జనాలు జంకుతున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

కల్హేర్(నారాయణఖేడ్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరు ప్రకటించడంతో కల్హేర్‌లో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా సంజీవరెడ్డి గెలుపొందడంతో పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బేగరి సాయిలు, వెంకట్‌రెడ్డి, పెరుమాండ్ల నర్సింహులు వీర్‌షెట్టి, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆరాధన ఉత్సవాలు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో ఈ నెల 7వ తేదీ గురువారం నుంచి మాతృశ్రీ జానకమ్మ, రఘునాథస్వామి(గండం బావి) ఆరాధనోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నర్సింహారావు కులకర్ణి తెలిపారు. గురువారం ఉదయం జానకమ్మ, రఘునాథస్వామిల లఘున్యాసపూర్వక రుద్రాభిషేకం, మఠ్ గృహం నుంచి శ్రీవార్ల పల్లకీసేవ ఊరేగింపు, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, రాత్రి నుంచి తెల్లవార్లు సదాశివపేట, భక్త బృందం వారిచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 8న శుక్రవారం శ్రీవార్లకు లఘున్యాసపూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం 5గంటలకు బాలమార్తాండ చైనయాజీ సమక్షంలో దత్తు మహరాజ్‌గారిచే హరికథ కాలక్షేపం, రాత్రి శ్రీగజానన్ దీక్షిత్ గౌలిపుర మాణిక్‌ప్రభు భక్తమండలి ప్రభునగర్ వారిచే సంప్రదాయక భజన, అనంతరం అగ్నిగుండం, గోపాలకాల హారతులు, శ్రీవార్ల పల్లకీసేవ ఊరేగింపు మఠ్‌గృహం వరకు నిర్వహిస్తారు. పట్టణ, మండల పరిధిలోని భక్తులు ఆరాధనోత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకుడు నర్సింహారావు కులకర్ణి తెలిపారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం



నిజాంపేట మండల ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గది

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలోని మండల ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో తరగతి గదుల్లోకి నీరు వస్తుంది. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో తూపాన్‌తో కురుస్తున్న స్వల్ప వర్షానికే తరగతి గదుల్లోకి నీరు వచ్చింది. దీంతో తరగతి గదులు విద్యార్థులకు ఇబ్బందికి గురయ్యారు. తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో బిల్డింగ్ పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పాఠశాలలోని అదనపు గదుల పనులను చేపట్టాలని శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను తొలగించి, నూతన గదులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.